# గువ్వల చెన్నా!



సారె చక్రం తిరుగుతూంది.

మట్టి బంగారం చేసే ఒక మహా యంత్రం తిరుగుతూంది.

సూరన్న చూపు ప్రాణం పోసి, చెయ్యి రూపం దిద్దుతూంటే సారె మీద మట్టి సాగుతూంది, ఉయ్యాల లూగుతూంది, గిరగిర గిరగిర తిరిగి సురుచిర కలశాలుగా మారుతూంది.

“అల్లా నీళట్టుకురా!” భార్యని పురమాయించాడు. వంగి రెండు చేతుల తోనూ డొల్లచెయ్యడం పూర్తయిన తరవాత ఒక ముడుకు మీద కూర్చుని చిన్న వెదురుబద్దతో చుక్కలు, గీతలు, నగిషీలు చెక్కుతున్నాడు, తిరుగుతూన్న కుండమీద. సన్నటి తడిగుడ్డతో అవసరమైన చోట సాఫు చేస్తున్నాడు. ఒక్కొక్క మారు వెనక్కి తగ్గి తన పనితనాన్ని సమీక్షించుకుంటున్నాడు.

బాగెమ్మ మట్టి కుడకలో నీళ్ళు పోసింది.

“సేన” అన్నాడు చూపు తిప్పకుండా. ఒక చేత్తో అంచును సర్దుతూ, మరో చేత్తో కుడక అందుకుని నీళ్ళు తాగాడు.

“రెండు జాములయ్యింది. తిండి దిన్నావు కావు ...” పనిలో ఉన్న భర్తకి పదే పదే తిండి మాట గుర్తు చేస్తే కసురుకుంటాడు. అందువల్ల భయపడుతూనే నెమ్మదిగా అంది బాగెమ్మ. ఆ భయం గమనించాడేమో చిరునవ్వు నవ్వాడు సూరన్న.

“ఆకలేస్తే నువ్వు తినే, బాగీ! ఈ గరేకుండలు పూరాగా అయిపోతేవే గానీ నా స్నైగను. సూస్తన్నావు గదా, ఏ పొద్దు ఎలా గుంటాదో ... మల్లా గాని వరసం పడిపోనా దంతే ...” పని వల్ల మాట పూర్తి కాలేదు. సారె చక్రం మీద కుండని సన్నపాటి తాడుతో కోసి, చాలా ఒడుపుగా రెండు చేతులతోనూ తీసి నేలమీద పెట్టాడు, పచ్చి మట్టి కనీసం వంకైనా పడనంత ఒడుపుగా.

“సల్లారిపోతే మల్లా తినవు. క్రూనెయ్యాలు పులుసేసినాను. ఒక్క పిడస తినేసి మలా సారి తిప్పుకుందువు గానె...” మొగుడి చిరునవ్వుతో ధైర్యం వచ్చినట్టుంది బాగెమ్మకి.

“సంపేస్తన్నావు” అన్నాడు గానీ లేవలేదు. మళ్ళా మట్టి మీద రెండు చేతులా నొక్కి సారె తిప్పుతూ కర్ర అందుకున్నాడు.

చల్లటి గాలి వీస్తూంది. రెండు రావిచెట్లు ఆకాశంలాగా కప్పుకున్న ఆ కుమ్మరి వాడ — అదొక ప్రపంచం. పది, పన్నెండు కుమ్మరి గుడిసెలున్నాయి. అంతా కలిసికట్టుగా తమ సనాతనమైన వృత్తి ధర్మాన్ని గొప్ప గౌరవంగా, తృప్తిగా నెరవేర్చుకుంటారు. అందరికీ ఉమ్మడిగా నాలుగు ఆములున్నాయి. అందులో పచ్చి కుండలు దొంతర్లుగా పేర్చి కాల్చుకుంటారు. ఆడవాళ్ళు, మగవాళ్ళు జట్లుగా పోయి పొరుగూళ్ళలో అమ్ముకొస్తారు కుండలు. తిరిగొచ్చినప్పుడు తమతో మెత్తటి మట్టి తవ్వుకుని తెచ్చుకుంటారు. ఆము కాల్చడానికి గడ్డి, కంప వీధుల్లో ఏరుకు రావడం, మట్టిలో కలపడానికి ఇసక డిబ మీద నుండి గంపల్లో ఇసక తీసుకు రావడం లాంటి చిన్న చిన్న పనులు చిన్న పిల్లలు చేస్తారు. పెద్ద వాళ్ళు కూడా

చూశాడు. తిరిగి తిరిగి అలిసిపోయి ఆగి పోయింది చక్రం. పక్కన కుప్పవేసిన మట్టి ముద్ద. పతి చేతిలో పర్సు. తన నొసట చెమట. రిక్షావాడి కళ్లలో తృప్తి. కొడుకు మొగంలో చెప్పలేనంత గొప్ప తనం. ముడుకు మీది మండి జీర గడు తూన్న రక్తం. ఒక వైపు ఒరిగిపోయి నిట్టూర్పులు విడుస్తున్న సారెచక్రం. హుషారుగా ముందుకి సాకే రిక్షా చక్రాలు.

"బువ్వ తిందువుగాని రా!" కూరె య్యల పులుసు చల్లారిపోతుందని కొండంత ఆత్రతతో వాడలోకి తోవ తీసింది బాగెమ్మ.

"అబ్బో, ఇంకానా? హోటల్లో మీల్స్ తిని ... భోజనమై పోయింది."

బాగెమ్మ మనసు చల్లారి చప్పబడి పోయింది.

మారన్న గుడ్లప్పగించి నిలబడి పోయాడు.

* * *

చిట్టెమ్మ అందం కిందటి వేసవి కింకా మొగ్గ. మూడు నెలలు తిరిగి మళ్లా పతి వచ్చేసరికి మొగ్గ కాస్తా పువ్వయి కూచుంది. మట్టి కొట్టు కున్న బట్టల్లో చూసినప్పుడు ఏవగింపే కలిగింది గానీ, బట్టలన్నీ గట్టుమీద వదిలి కోనేట్లో స్నానం చేస్తున్నప్పుడు మాత్రం, చాటుగా చూస్తూన్న పతికి చిట్టి మీద మోహం మొలక లెత్తింది. తన గర్ల్ ఫ్రెండ్ నిర్మలాకుమారి కంటే పదిరెట్లు పసందనిపించింది చిట్టి.

చిట్టి స్నానంచేసి బట్టలు ఒంటి మీద చుట్టబెట్టుకుని, మట్టి తట్ట చంక కెత్తుకుని మామిడి తోపులోకి నడిచింది, ఎండంత సేపూ కూర్చోవ డానికి. అలాంటి సమయంకోసం కని పెట్టుకున్న పతి చెట్టు చాటునుండి మెమ్మదిగా తోటలోనికి నడిచాడు.

తోట నిర్జనంగానూ ఉంది.

చిట్టికోసం చూశాడు. కనిపించలేదు.

"చిట్టీ!" ఏ చెట్టు చాటునో కూచుందని కేకవేశాడు.

"ఓ లమ్మో! ఎవులాలు?" ఉలికిపడి తుపుక్కుమని గుండెమీద ఉమ్మేసుకున్న చప్పుడు విని తల పైకెత్తాడు. చెట్టెక్కి కూర్చుని తాటి తీగలు నములుతూంది చిట్టి.

"కిందికి దిగు." నవ్వుతూ పిలిచాడు.

"బావయ్యా! నువ్వా! ఎందు కొచ్చినావు? నాను దిగను" అంది.

"సరే, నేనే వస్తాను" అంటూ చెట్టెక్కసాగాడు పతి.

"ఏలా? ... దిగు దిగు ... నువ్వెందు కేటి? ఉండు, నానే దిగిపోతాను ... ఇంటి కెల్లి పోవాల ..." అని కంగారు పడుతూ దిగబోయింది.

"ఏమిటీ కంగారు? కూర్చో ... కాసేపు చల్లగా కబుర్లు చెప్పుకు పోదాం." అప్పటికే చెట్టెక్కి చిట్టి కూర్చున్న కొమ్మ మీదికి చేరిపోయాడు.

"ఏం తింటున్నావు?" అడిగాడు.

బెంబేలుపడుతూనే తాటి తీగలు అందించింది చిట్టి.

"ఛ! ఇలాంటివి తినకూడదు. ఆరోగ్యం చెడుతుంది" అన్నాడు పిటపిట లాడుతూన్న చిట్టి ఆరోగ్యానికి ఒకవైపు నోరూరిపోతున్న పతి.

"ఏంది?" అమాయకంగా అడి గింది.

"ఏంది, గొంది ... ఛండాలం! ఏమి టా భాష?"

"ఏమి? మన బాసే ..."

"మన భాష కాదు. మన మాతృ భాష చాలా మధురమైన భాష." చదువు కున్న డాబు కొంచెం ప్రదర్శించ బోయాడు.

"మాతృ బాసంతే?" అడిగింది.

"మాతృ భాషంటే ... అది ... మాతృ భాషన్న మాట! అంటే ... ఇప్పుడు .... మాతృ ... అంటే తల్లి ... తల్లి భాష!" కళ్లెగరేసి చెప్పాడు.

"తల్లి బాసా? మరి నా తల్లి నాలాగే మాట్లాడతాది. నీ తల్లి కూడా నాలాగే మాట్లాడతాది. అయితే నువ్వే మాతృ బాస మాట్లాడవు. అదేదో పట్నపోళ బాస మాట్లాడతావు ..." బెరుగ్గానైనా జవాబిచ్చేసింది.

"అది కాదు, చిట్టీ '...' అంటూ కాని దేదో చెప్పడం ప్రారంభించి అన్నీ కాని మాటలే చెప్పేయసాగాడు. పట్నాల్లో వేష భాషలు, వ్యవహారాలు, ఆడా మగా ఎంత కలిసి మెలిసి తిరుగు తారో — మొత్తం హైదరాబాదు మెట్రోపొలిటన్ వాతావరణాన్ని చిట్టి చెవి కెక్కించ బోయాడు. ఔను, మరి, మరెక్కడా మెడిసిన్ సీటు దొరక్కపోతే బూరెల గంపలాంటి హైదరాబాదులో పడ్డాడు పతి. అదృష్టవంతుడు.

"స్వయంగా ఆడపిల్లలే మగాళ్ల భుజాల మీద, ఇదుగో, ఇలా చేతులు..." చిట్టి భుజం మీద చెయ్యి వేశాడు పతి.

చిట్టి గతుక్కుమంది. తప్పింది. తప్పుకుంది.

తప్పుకి తప్పుకోవడం తెలిసిన పతి, కాస్త చెయ్యి తూలిం దంతే అన్నాడు. కానీ, అంత సమీపంలో చిట్టిని చూస్తుంటే పతికి మతి పోతూంది.

ఎండగా ఉందన్నాడు. ఎడంగా ఉండద్దన్నాడు. ఎవరూ లేరన్నాడు. తా నెవరో కానన్నాడు. బావ నన్నాడు. సుఖాలకి తోవ నన్నాడు. ప్రణయాన్ని



ఏకాకి

ఫోటో— బి. పి. రెడ్డి (గోవా)

వచన కవిత్వంలో ప్రారంభించి పద్యాలు, ప్రబంధాల దాకా చెప్పాడు చెట్టుమీద కూర్చుని.

కానీ, ఒకొక్క ప్రక్రియకీ ఒకొక్క కొమ్మెక్కి పోతూంది చిట్టి.

కిందికి దిగనివ్వకుండా వెంట తరుము తూన్న పతిని చూసి భయం భయంగా కొన కొమ్మల వైపు దాటుకోసాగింది చిట్టి. కడ కొమ్మ మీద కూర్చున్న చిట్టిని విలాసంగా పతి ఒడిలోకి లాక్కో బోయినప్పుడు తూలింది. ఆ తూల డంలో ఇటు జారితే పతి చేతులు! అటు జారితే నేల గోతులు!

ఎటు జారినా జారడమే అనుకుని జారి గోతిలో పడింది చిట్టి.

* * *

పతి సెలవు లైపోయి హైదరాబాదు బయలుదేరే నాటికి చిట్టి చొట్ట ఖాయపడిపోయింది. నయం, చావు కాలు చొట్ట బోయింది. నాటు వై సరిగా లేదని, పతిని కొంచెం చ మన్నారు — డాక్టరు చదువే గదా చ తున్నాడని! కానీ, చిట్టి ఎదురుగా డానికి పతి కెందుకో సాహసం చా కాదు. అందుచేత భౌత్తిగా మో పై భాగమునందు చిట్టికి గా తగిలింది, తను పురుషుడు కట్ట నేరడని చెప్పేశాడు పతి.

ఆ రోజు పతి బయలుదేర్ రోజు.

డబ్బుకోసం వచ్చాడు గానీ బంగా సెలవులకి రానేరాడు పతి.

"నాయినా, తిరపతి కొండా బొన్న పొత్తులు నమిలీ, కొడకా!

చ్చన్న బట్టుకొచ్చినాడు, అంబల్లాక కోసం ..." ఉడకేసిన జొన్న పొత్తులు అందించింది బాగెమ్మ. మెత్తగా ఉప్పులో ఉడికి వేడి వేడిగా కమ్మటి వాసన వేస్తున్నాయి పొత్తులు.

"అమ్మా!" నగిషీ చెక్కిన ఈసడింపుతో నవ్వి జొన్న పొత్తులు తల్లి చేతుల్లో నుండే పరీక్షగా చూసి, "జొన్న పొత్తులు. గుడ్! బచ్చన్న తెచ్చాడు. వెరీ గుడ్! అంబల్లాకకోసం! హారిబ్లీ గుడ్! వెరీ నేటివ్! కానీ చూడు, నీ చేతుల్లోని మట్టి! అందులో కంటి కన్నావడకుండా భయంకరమైన క్రిములుంటాయి ... అవి గొంతు నాళంలోంచి ఉదరకోశం లోకి భయంకరంగా ..." అంటూ ఒక భయంకరమైన ఉపన్యాస మిచ్చి తల్లిని అదరగొట్టాడు. అదరగొట్టి జొన్న పొత్తులు అక్కర్లేదని తిరగ్గొట్టాడు.

---

### మూరం

**ఒక డజను మంది వివేకవంతులు ఒక గంటలో అడిగే ప్రశ్నలకన్న మూర్ఖుడు ఒక్క నిమిషంలో ఎక్కువ ప్రశ్నలు వేయగలడు.**

—లెనిన్

---

మార్చువరీలో శవాలు కోసి, కనీసం తులైనా కడుక్కోకుండా కాంటీన్‌లో జనాలు ముగించిన సందర్భాలు ప్పటికి మరిచిపోయాడు పతి.

"చిన్నప్పుడు ఈ జొన్న పొత్తులతే ఆమోర్చకంగా తినేసేవోడివి,కొడకా!" ఏదో తీగె నొక్కేసిన స్వరంలో గొణిగింది బాగెమ్మ. ఆ విషయం గుర్తుగానే గొప్ప అవమాన భారంలో అక్కడిడి కదిలి వెళ్ళాడు పతి.

గాలి చప్పుడు చేస్తూ వీస్తూంది.

చెట్ల కింద మట్టి పనులు జోరుగా సాగుతున్నాయి. వామిన పచ్చి కుండలు గో ఆరపెట్టిన తరవాత అడుగు న్ని కలపడంకోసం ఒక చేత్తో ండటి రాయి పట్టుకుని, దాని మీద బోర్లించి, మరో చేత్తో వాటంగా స కర్ర దిమ్మెసతో చరుస్తారు. క నాజూగ్గా సాగి, చివరు అతుటాయి. దానిమీద మెరుగు చల్లి కుండంతా కొన మెరుపులు గారు.

మ్మరి వాడ హోరెత్తిపోతూంది. ర్కళ్ళన్నీ గొప్ప లయబద్ధంగా ఒక రకమైన సంగీతాన్ని వినిపిు కానీ, పతికి మాత్రం భయం వేసింది. కంపరం పుట్టింది. ఏమిటిది? మొత్తం జనమంతా మట్టిలో చతికిల బడి, ఒళ్ళంతా మట్టిని క్రీమ్ పూసుకున్నట్టు పూసుకుని, మట్టి కుండలు పట్టుకుని మట్టి వెధవ పనులు చేస్తున్నారు.

ఆనాడు తాను సాహసించి కూచున్న ప్రతి పరీక్షలోనూ కాపీలు కొట్టి పాసయి ఉండకపోతే ఏమైపోవును తన గతి? ఇదుగో, ఈ మట్టి వెధవ పనే గతైపోయేది. బంగారం లాంటి తన బ్రతుకు మట్టిపాలై పోయేది.

"సింవాలుతాత రమ్మంతన్నాడు." గోచి ఎగదోసుకుంటూ ఒక గుంటడు చెప్పిన కబురుతో గతుక్కుమని ఈ లోకంలో కొచ్చాడు.

'సింవాలుతాతా?' గుండెల్లో చెమట పుట్టింది. చిట్టి గూర్చి అడుగుతాడా కొంపదీసి? చిట్టి చెప్పేసిందా చివరికి?

"ఎందుకు?" అడిగాడు.

"నా కేం ఎరిక?" అని తుర్రు మన్నాడు గుంటడు.

'నా కేది గతి?' అని ఎటో పతి జారుకోబోయే లోపున పాకలో నుండి సింవాలుతాతే కేకేశాడు. ఇక మరి తప్పలేదు పతికి. వెళ్ళాడు.

అక్కడే తండ్రి సూరన్న, మరి కొందరు పెద్దవాళ్ళు కూడా ఉన్నారు.

"కూకుడు" అన్నాడు అచ్చయ్య మామ.

"సాయంకాలం బయలెల్తన్నావట?" యథాలాపంగా అడిగాడు సింవాలు.

పతి తల ఊపి, గుటకేసి, తరవాత తెరిపిగా "ఔను" అన్నాడు.

మరో గడియ ఏవో కబుర్లు సాగిన తరవాత ఒక పెద్ద మనిషి గొంతు సర్దుకుని ప్రారంభించాడు: "మరైతే నీ పెళ్ళిమాట ఏటి సెప్తావురా, తిరపతీ? నువ్వు సదువో, సదువో అనుకోని పట్నం మెలిపోతుంటే మరి సిట్టి గుంట సెవుర్తాడీసి మూనెల్లయి పోనాదిగదా? ఏటి, మూర్తం మెట్టించి మన్నావంటే వస్తన్న ఆవిటికలా ఎట్టించేస్తాడు. సింవాలు తాత బరు వొగ్గి పొద్ది."

పతికి గుండె తేలికై పోయింది.

అయితే తనమీ దేమీ చెప్పలేదు చిట్టి.

"అదా?" అని చిరునవ్వు నవ్వి, "అసలు నేను చిట్టిని చేసుకోనే!" అని చాలా సూటిగా జవాబు చెప్పాడు. పతి అనుమానైన చోట చాలా ముక్కుసూటిగా పోయే మనిషి.

కానీ, పతి జవాబుకి అందరూ దిగ్భ్రమ చెందారు.

"ఎందుసేతను?" సింవాలుతాత అడిగాడు, పాపం.

"అది నా ఇష్టం." పతి జవాబు.

అందరూ సూరన్న వైపు చూశారు విడ్డూరంగా. సూరన్న కించిత్తు చిన్నబోయి కొడుకువైపు తిరిగి బోధపరచబోయాడు. చిన్నప్పటినుండీ చిట్టిని తిరపతి కిచ్చి చెయ్యాలని చచ్చిపోయిన తన అప్పచెల్లెలు — పాత మనుషులు, పాత బ్రతుకులు గనక చాలా పాత కథని తిరగదోడాడు.

అప్పు డొక చరిత్రాత్మకమైన ఉపన్యాస మిచ్చాడు పతి: "ఎవ రెన్ని చెప్పినా ఇది అసాధ్యం. నేను చిట్టిని చేసుకోను; చేసుకోలేను. చూడండి, అసలు నా కీ మట్టి, మశానం, ఈ వాతావరణ మంటేనే ఛెడ చిరాకు. ఈ జాతిలో పుట్టినందుకు నాకెంతో, అయామ్సారీ, అవమానంగా ఉంది! మీరంతా మూర్ఖంగా ఈ పల్లెటూర్ని, ఈ మసి బతుకుల్ని, మీ కుల వృత్తుల్ని ఎంత గౌరవించుకుంటున్నా ప్రపంచానికి తెలుసును మీ దెంత ఛండాలపు వృత్తో! అందుకే అంతా మెకానైజయిపోయింది ప్రపంచం. అంతా ఎవ్విరిథింగ్ మెకానికల్! ఇంక మాన్యువల్ లేబరు గో టు డాగ్స్! తెలిసింది గదా? అందుచేత నాకు మీ వాతావరణం పడదు. అలాంటిదీ నే నొక కుమ్మరి గుంటను కట్టుకుని కుమ్మరి పిల్లల్ని కని, కుమ్మరి బతుకు బతకడం — దారుణం! అసలు మీ సొసైటీ నాకు గిట్టదు. ఏమ్మెరత్త, కుమ్మరి మామ ... నో నో! హారిబుల్! ఏదో పుట్టేశాను, అయిపోయింది, అంతే! ..."

అక్కడున్న వాళ్ళందరి నోళ్ళు పడిపోయాయి.

ఆ మాట అన్నది మరో జాతివాడైతే ఆసరికి పుర్రె లేచిపోయేది. కానీ, తమవాడు. తమ జాతివాడు. తమలోని వాడు. తమ జాతినే ఇలా దుయ్యబడుతూంటే అదేదో భ్రమలా ఉంది వాళ్ళకి. అవును, తమ వృత్తిని నమ్ముకున్నారు—తమ మట్టిని నమ్ముకున్నారు తాము. ఆ నమ్మకం తమలో కలిగించిన గర్వం, తమ మీద తమకున్న గౌరవం అంతా ఉచకోతగా నరికేస్తున్నాడు పతి! పతి, పతి గనకనే బ్రతికిపోయాడు.

అందరూ మొగాలు చూసుకుని ఎవరి మానాన వాళ్ళు లేచిపోయారు.

సింవాలుతాత విస్మయంగా చూశాడు.

"ఇప్పుడు మరీ అన్నేయంరా! దాని కాలు పోనాది. దాని కర్మ కాలిపోనాది. మన జట్టోడివి నువ్వే కట్టుకోనంతే మరి పరాయోడు కట్టుకుంతాడా?" అని అడిగితే, భుజా లెగరేసి — "ఇది బావుంది! జట్టులోని వాణ్ణయిన పాపానికి చొట్ట పిల్లని చేసుకోవాలా? చూశావా! అందుకే నాకు మీ జట్టు గిట్టదు" అన్నాడు పతి.

అని గడప దాటి వెళ్ళడానికి వంగుతూంటే ఎదురుగా దిడ్డీ పక్కన చీకట్లో ఆకాశమంత ఆశని ఆరిపేసుకుంటున్న ఒక జత కళ్ళు కనిపించాయి.

ఆ సాయంత్రమే పతి బయలుదేరి పోయాడు. వాడలోని జనం సాదరంగా వీడ్కోలు చెప్పారు. పతి మాటలు తలుచుకుని కొందరు పెద్దలు జాలి పడ్డారు. మరి తమ జట్టులోకి పతి తిరిగి రాడేమో అన్నంత ఆత్రత కన పరిచారు కూడా.

బండెక్కుతూన్న కొడుక్కి మట్టి చేతులతోనే డబ్బిచ్చాడు సూరన్న.

"అదుగో మట్టి" అన్నాడు రుమాలుతో నోట్లు తుడుచుకుంటూ పతి.

ఫక్కుమని నవ్వు వినిపించగానే జనంలోకి చూశాడు. చిట్టి!

గంగి భుజాల మీద చేతులానించి జనం మధ్యలో నిలబడి ఉంది.

తనవైపు చూసి నవ్వుతూ, "ఆ మట్టే గాదా నీ చేతిలోని డబ్బు? ఆ మట్టి పిసికి కుండలు సేసి అమ్ముకొచ్చిన డబ్బే ..." అంది.

చిట్టి జవాబు విని తొందరగా బండిని పోనిమ్మన్నాడు పతి!

* * *

బండి ఆగింది!

వర్షం పడి బండి చక్రాలు మట్టి కొట్టుకు పోయాయి.

బండి దిగాడు తిరపతి!

దిగి, మట్టిమీద కాలూనబోయి తూలి పడిపోయాడు మట్టిలో.

"బావయ్యా!" లేవనెత్తిన ఆడ చేతులు మట్టి వాసన వేశాయి.

బాగెమ్మ దిష్టి తీసింది.

"ఇటు, తిరపతీ!" చెయ్యి పట్టుకుని నడిపించాడు సూరన్న.

అటు నడిచాడు తిరపతి. అంతా కమ్మటి మట్టి వాసన. కర్ర దిమ్మెచరుపుల కమ్మటి సంగీతం. కుమ్మరి ఆము కాలి కమ్ముకుంటున్న ఘాటైన చిక్కటి పొగ. విడ్డూరం చూడ మూగిన కుమ్మరివాడ జనమంతా తిరపతి చుట్టూ ఘుమఘుమలాడి పోతున్నారు.

"తిరపతి బాబూ! ... సంగాతూ ... ఏమిరోయ్, దద్దా! వచ్చినావురా, నాయినా! ... ఓహో సలిమిడి ముద్దా ... తిరపతే...

దార్నాయిన ... ఎలిపొచ్చినావయ్యా?" బలగమంతా ఎప్పట్లాగా పలకరించారు.

"ఆఁ ఎలిపొచ్చినాను." మరిచిపోయిన మాతృ భాషలో జవాబు చెప్పాడు తిరపతి.

చెల్లని కాసులాగా గిరుక్కున తిరి గొచ్చేశాడు తిరపతి.

మరి రాడనుకున్న తిరపతి తిరిగి రావడం చాలా మందికి ఆశ్చర్యం వేసింది. ఇలాంటి దీనావస్థలో వస్తాడనిమాత్రం అనుకోని బాగెమ్మ శోకాలు తీస్తూంది.

"ఇక్కడ తొంగో, తండ్రీ ..." బొంత పరిచింది నడవలో.

పడుకున్నాడు. బొంత మట్టివాన పేసింది. కానీ లేచిపోలేదు.

"ఆక లేస్తూంది." మూలిగాడు.

బాగెమ్మ వంట పాకవైపు పరుగు తీసింది.

చుట్టూ చేరిన జనం మాటాడుకో పొగారు...

"మన వాడకి దరిద్రం పట్టు కున్నట్టుంది. కిందటేన్నెల సిట్టికి కాలు పొవాది. ఈ నెల తిరపతయ్యకి కళ్లు రెండూ పోనాయి..."

"అయితే ఆ కళ్లు మరి రానట్టేగే వంతావా?"

"అలగయితే మరి సదువు కెల్లడంతా వేటి?"

"మరేటి సదువు? కబళ మెత్తుకోని నోట్లో ఎట్టుకోలేని కబోది గదా, కత్తులట్టుకోని ఆపరేసన్లు పెయ్య మంతావేటి?"

"అదే అంతాన్నాను..."

కొందరు నవ్వుకున్నారు.

కొందరు చొచ్చుకొట్టారు.

"పోనీ, ఆడికేటి, ఏ గుమాస్తా పనైనా సేసేస్తాడు." ఓదార్చారు మరొకరు.

"కానీ పనికిరాడట. పెద్ద డాకిటేర్లు మనోడ్ని పరీచ్చసేసి ఏ ఉద్యోగానికీ పనికి రాడని తీరుమానం సేస్సి పంపించీసినారట. ఆ పెయుత్నాలన్నీ సేసుకోనే తిరగాలి పొచ్చినాడు మమారు ..."

"అయితే మరేటి సేత్తాడు?"

"మంతోపాటే మట్టి పని!"

పతికి గుండె ఝల్లుమంది! మట్టి పని!!

"ఔను. అదిగదే మంచిది. ఏదైనా కులవుర్తికి సాటేటి? ఎన్ని సదువులు సదువుకుంటే మాత్రం? మన సుకం మన సుకమే!"

"ఔనూ, నా నెర క్కడుగుతానూ, ఏమాత్రం సదువుకున్నోళ్లంతా పట్నపు నౌకరీలకోసం ఎగబడతారు గానీ కుల వుర్తి ఊసెత్తరేమి? సదువు గవర్న మెంటు ఉద్యోగాలకే గానీ మరెందుకూ పనికిరాదా? అందరూ ఇలగ ఎగబడి నందువల్లే ఆ ఉద్యోగాలు కూడా కరువై పోనాయుట? ఎందు కొచ్చిన తిప్పలు సెప్మీ! 'ఇల వుర్తు లెన్ని యున్నను కుల వుర్తికి సాటిరావు' అన్నాడు. ఏటంతా వురా, తిరపతీ!" సింవాలుతాత అడిగాడు.

ఏమీ అనలేదు తిరపతి.

"ఆడికి మట్టి పనంతే అశాయం గదా?"

"అలగైతే నోట్లోకి మట్టే మిగు లాత్తది మరి ..."

వృత్తి పట్ల గౌరవంతో అంతా నవ్వారు.

నవ్వి, ఎవరి మానాన వారు వెళ్లి పోయారు.

పక్కనున్న గోడకి తల బాదుకో బోయాడు తిరపతి. కానీ పక్కనున్నది గోడ కాదు. తన నీడ!

"ఎవరది?"

"నాను బావయ్యా, సిట్టిని! ..." తిరపతి తలని చేతుల్లోకి తీసుకుంది.

ఏడిచాడు తిరపతి. ఏడు పాపుకుంది చిట్టి. అతన్ని వారించింది.

"అందరూ వెళ్లి పోయారా?" అడిగాడు.

"ఆఁ" అంది చిట్టి.

చాలాసేపు తంటాలుపడి చివరికి అడిగాడు: "ఈ పరిస్థితుల్లో నన్ను నువ్వు పెళ్లిచేసుకుంటావా, చిట్టీ?"

"అదేటి, బావయ్యా?" నిస్సంకో చంగా జవాబు చెప్పింది. "నువ్వు సేసుకో నన్నా బలవంతంగా సేసుకుంతాను. నాకు కాలొక్కటే పోనాది. నీకు కళ్లు రెండూ పోనాయి గదా? మరి నాను సేసుకోక పోతే నిన్ను సూసుకునేవోళ్లెవరు?" అంది.

తిరపతికి నోట మాట రాలేదు. నీరసంగా వాలిపోయాడు.

"ఆకలేస్తున్నాదేటి?" పసిపిల్లాడి నడిగినట్టడిగింది చిట్టి.

అవునన్నట్టు తల ఊపాడు తిరపతి.

"అత్తా! బావయ్య కాకలేస్తున్నా దంటన్నాడు," అరిచింది చిట్టి.

"ఓరయ్య, నీ ఉసురు నాకు బడ!" పెరట్లోనుండి పరుగెత్తుకొచ్చింది బాగెమ్మ. "వంట కానేదు, కొండా! ఒక్క సెనం తాళయ్యా!" అంది.

"తినడాని కేమీ లేదా? జొన్న పొత్తులైనా లేవా?" అన్నప్పుడు నవ్వ బోయాడు తిరపతి. కానీ ఏడుపొచ్చింది.

"నేపురా..." అంటూ బాగెమ్మ వంట తొందరమీద పరుగెత్తింది.


"అస లింత గోరం మెలాగ జరిగి పోనాది, బావయ్యా?" అడిగింది చిట్టి.

"హైదరాబాదులో గొడవలుగా ఉందిలే— నీకు తెలీదు. చీకట్లో తప్పిం చుకు పారిపోవడంలో పడిపోయాను. కళ్లకి ఊచలు గుచ్చుకుపోయాయి."

అంతకంటే ఓపికగా చెప్పలేక పోయాడు.

ఆ రోజు గడిచిపోయింది.

మర్నాడు గడిచిపోయింది.




మూడో రోజు తెలతెలవారుతూండగా చిట్టి భుజం మీద చెయ్యి వేసి చెట్టు కిందికి నడుచుకెళ్లాడు తిరపతయ్య.

"కూకో, బావయ్యా!" గోనె మీద కూర్చోపెట్టింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని చుట్టూ ఉన్న పని ముట్లన్నీ వివరించింది.

"ఇదుగో, బావయ్యా! ఇది సారె చెక్రం. ఈ పక్కనుంది నోలు బద్ద. ఇదిగిది కర్ర. ఈ కుడకలో నీళ్లున్నాయి, దారప్పొ గుంది. ఈ పక్కన, ఇదుగో నూడు — ఇది మన్ను!"

మన్ను చేతులకి తగలగానే ఆగిపో యాడు పతి.

"మన్నా?" అన్నాడు.

"అవును, తిరపతీ!మన్ను."పక్కన నిల బడిన సూరన్న జవాబు చెప్పాడు. "ఈ నేలమీద రాజైనా, బంటైనా మజిలీ పూర్తవడంతోనే కలిసిపోవలసిన మన్ను! దానికి దండం బెట్టి పని మొదలెట్టు..."

మన్నుమీద రెండు చేతులూ ఆనించాడు తిరపతి.

రెండు వేడి కన్నీటిచుక్కలు మన్నులో కలిసి ఇంకిపోయాయి.

చిట్టి కర్ర అందించింది.

సారె తిప్పాడు తిరపతి.

నెమ్మదిగా తిరగసాగింది సారె చక్రం. పాకలో నుండి చూస్తున్న సింవాలు తాత ఇలా అనుకున్నాడు:

'ఇల వుర్తు లెన్ని యున్నను - కులవుర్తికి సాటిరావు ...'